క్లుప్తంగా

సిద్ధమవుతున్న రుద్ర ప్రభలు



జి.అగ్రహారంలో ప్రభను సిద్ధం చేస్తున్న యువకులు

అంబాజీపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవానికి తరలివచ్చే రుద్ర ప్రభల నిర్మాణాలను బుధవారం పూజలు చేసి ప్రారంభించారు. గంగలకుర్రు అగ్రహారం, వక్కలంక, నేదునూరు తదితర గ్రామాల్లో ప్రభలను గ్రామస్తులు, యువకులు సిద్ధం చేస్తున్నారు. ప్రభల అలంకరణకు అవసరమైన తాడిశూలం, వెదురుబొంగులు, పోక కర్రలు, నెమలి పింఛాలు, రంగు రంగుల వస్త్రాలతో రుద్ర ప్రభలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యం కలిగిన ప్రభల ఉత్సవం ఈ నెల 16వ తేదీన జగ్గనతోటలో జరగనుంది.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



పెనికేరులో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పెనికేరులో సుమారు రూ.25 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన నాయీ బ్రాహ్మణ సంగీత కళా నిలయాన్ని మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. సర్పంచ్ వనుం చిన్నావతి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రసంగించారు. నాయీ బ్రాహ్మణుల మంగళ వాయిద్యాలు శుభకార్యాలకు ప్రతీక అని కొనియాడారు. నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని నాయీ బ్రాహ్మణ సంఘ సమాఖ్య ఘనంగా సత్కరించింది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జుత్తుక శ్రీనివాసు, ఎంపీటీసీ యనమదల స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసు, సూదివరపు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక విముక్తే లక్ష్యంగా పాదయాత్ర



అంబాజీపేటలో పాదయాత్ర చేస్తున్న విజయ్‌కుమార్

అంబాజీపేట: ప్రస్తుత సమాజంలో పేదరిక విముక్తే లక్ష్యంగా.. ఐక్యతా విజయ పథం పాదయాత్రను నిర్వహిస్తున్నట్టు రిటైర్డ్ ఐఏఎస్ జీవీ ఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌కు బుధవారం చేరుకున్న విజయ పథం ర్యాలీకి పలువురు నాయకులు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ యాత్ర ద్వారా సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించి, సామాజిక అసమానతలు తొలగించి, రాజకీయ చైతన్యాన్ని కలిగించేలా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గతేడాది 2023న తడ నుంచి ప్రారంభమైన ఐక్యాతా విజయపథం పాదయాత్ర నేటికి 125 రోజులు పూర్తయిందని, 2,355 కి.మీ. పాదయాత్ర చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బీర రాజారావు, నూకపెయ్యి చిన్న, ఎస్.విజయశ్రీ, ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుడికి పింఛను అందజేత



మాచవరంలో రామారావుకు పింఛను అందజేస్తున్న సత్యమోహన్, శాంతకుమారి

అంబాజీపేట: కిడ్నీ వ్యాధిగ్రస్తుడు మాచవరానికి చెందిన సిద్దంశెట్టి రామారావుకు రూ.10 వేల పింఛనును జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి బుధవారం అందజేశారు. అర్హులైన లబ్ధిదారులు వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు

అయినవిల్లి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్సై సురేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు, గుండాట వంటివి నిర్వహిస్తే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హామీలన్నీ పూర్తి చేసిన జగన్

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- బిళ్లకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపేట: చెప్పిన మాట.. ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని బిళ్లకుర్రు గ్రామంలో బుధవారం ఉదయం, పలివెల శివారు వీరభద్ర చౌదరిపురం, పూజారిపాలెం గ్రామాల్లో సాయంత్రం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అన్నిచోట్లా లబ్ధిదారులు, మహిళలు, యువత జగ్గిరెడ్డిపై పూలవర్షం కురిపించి, ఘన స్వాగతం పలికారు. ఇంటింటా వివిధ పథకాల లబ్ధిదారులు జగ్గిరెడ్డికి సాదర స్వాగతం పలికారు. ఆయా లబ్ధిదారులకు వర్తించిన పథకాలను జగ్గిరెడ్డి వివరిస్తూ, బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా, అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి, సంక్షేమ విప్లవాన్ని సృష్టించారన్నారు. ఆ ఘనత దేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో ఇంతకుమించి వినూత్న పథకాలతో పరిపాలన సాగించే సత్తా జగన్‌కే ఉందన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో లబ్ధి చేకూరిందో, ఆర్థిక అవసరాలు తీరాయో ప్రతిఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలని, రాబోయే రోజుల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. తొలుత సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు స్వగృహం వద్ద భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమ ఫ్లెక్సీని జగ్గిరెడ్డి ఆవిష్కరించి, సంతకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, వానపల్లి దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, అవిడి, గంటి సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, పార్టీ మండల నాయకుడు బొక్కా లోకేష్, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, గ్రామ అధ్యక్షుడు కాకర సర్వేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మంగిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బిళ్లకుర్రులో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

182 మంది మహిళలకు ఇళ్ల స్థలాల అప్పగింత

రాష్ట్రంలో మహిళలకు పుట్టింటి కానుకగా వారి పేరున జగనన్న ప్రభుత్వం సొంత ఇంటి స్థలంతో స్థిరాస్తి కల్పించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పలివెల గ్రామంలో 182 మందికి ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసే కార్యక్రమం బుధవారం సాయంత్రం జరిగింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మహిళలకు స్థలాలను స్వాధీనం చేశారు. లబ్ధిదారులకు పట్టాతో పాటు జగ్గిరెడ్డి వ్యక్తిగతంగా పసుపు, కుంకుమలు అందజేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో, మళ్లీ ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో స్థలాలిచ్చిన దాఖలాలు లేవన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళల పేరున ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి, ఓ స్థిరాస్తిని ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి సమాజంలో గౌరవం కల్పించామన్నారు. నియోజకవర్గంలో 343.98 ఎకరాల భూమి సేకరించి, 17,190 మందికి, ఈ మండలంలో 3,980 మందికి పట్టాలుగా ఇవ్వడం సరికొత్త రికార్డు అన్నారు. ప్రతి స్థలం దాదాపు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ ఉంటుందన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వం వచ్చాక, మౌలిక సదుపాయాలు కల్పించి, ఇళ్లు కట్టించే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, సర్పంచ్ రెడ్డి చంటి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తులా సూరిబాబు, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుర్రా శ్రీను పాల్గొన్నారు.

శనైశ్చర క్షేత్రంలో సంక్రాంతి సంబరాలు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఏసీ, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. గంటాలెద్దుల బృందం, హరిదాసు కీర్తనలతో పాటు భోగిమంట ఏర్పాటుచేశారు. జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ గ్రంధి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సప్తాహ మహోత్సవం ప్రారంభం

మామిడికుదురు: పెదపట్నం గ్రామంలోని మూలేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో 19వ సప్తాహ మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. తోరం యువరాజు, సూర్యకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ నెల 17 వరకూ సప్తాహ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

ప్రభుత్వ లక్ష్యం మేరకు పీహెచ్‌సీ సేవలు

ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సేవలను ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అందించి, ఉత్తమ పీహెచ్‌సీగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని వానపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ, కమిటీ అధ్యక్షుడు మార్గన గంగాధరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. పీహెచ్‌సీలో వివిధ అంశాలపై సమీక్షించారు. నిర్మాణ దశలో ఉన్న భవనం, నిర్మాణం చేయాల్సిన ఆర్చి గేటు, వివిధ పరికరాల కొనుగోలు, మరమ్మతులు, తాత్కాలిక సిబ్బంది వేతనం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు పల్లి భీమారావు, సాదు వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఇ మహేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎస్ నిహారిక, డాక్టర్ ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

ఆహార భద్రత కోసం ఉచిత బియ్యం

సఖినేటిపల్లి: ప్రతి గ్రామంలోను ఆహార భద్రత కోసం రూ.కోట్లాది వ్యయంతో పేదలకు ఉచిత బియ్యాన్ని కేంద్రం పంపిణీ చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. బుధవారం గుడిమూల, మోరి గ్రామాల్లో ఎంపీడీఓ బడుగు మంగాదేవి వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశాలు నిర్వహించారు. గుడిమూలలో సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, మోరిలో సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. మోరి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.పూర్ణచంద్ర కుమార్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డుల ప్రయోజనాలను వివరించారు. వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, బీజేపీ నాయకులు చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, పట్టపు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



మోరి సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణచంద్ర కుమార్

ఆరోగ్యశ్రీ కార్డులకు ఈ-కేవైసీ చేయాలి

అంబాజీపేట: ప్రతి వలంటీర్ తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులకు ఈ–కేవైసీ నమోదు చేసి, లబ్ధిదారులకు అందజేయాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ మూర్తి అన్నారు. పుల్లేటికుర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంపై సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 12న పుల్లేటికుర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.



పుల్లేటికుర్రులో హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

విద్యార్థులకు టాలెంట్ టెస్టు

మలికిపురం: నిర్మల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో లక్కవరం డిగ్రీ కళాశాలలో పాఠశాలల విద్యార్థులకు బుధవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. సుమారు 226 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పడమటిపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థిని అడబాల నాగవెంకట సత్యశివాని, మేడిచర్లపాలెంస్కూల్ విద్యార్థిని దుర్గాభవాని, మొగలికుదురు జెడ్పీ స్కూల్ విద్యార్థి పీఎల్‌సీ రామ్మూర్తి బహుమతులు పొందారు.

పేదల ఆత్మ బంధువు సోమసుందరరెడ్డి

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- జయంతి సందర్భంగా దుప్పట్ల పంపిణీ

రావులపాలెం: దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి పేద ప్రజల ఆత్మ బంధువుగా నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సోమసుందరరెడ్డి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రావులపాలెం సెంటర్‌లో డాక్టర్ సోమసుందరరెడ్డి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు జగ్గిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ తన తాత జగ్గిరెడ్డి హయాం నుంచీ తమ కుటుంబం ప్రజా సేవకు అంకితమైందన్నారు. తన తండ్రి సోమసుందరరెడ్డి అధికారం ఉన్నా, లేకపోయినా ఎప్పుడూ ప్రజలతోనే ఉన్నారన్నారు. ఎవరికి కష్టం వచ్చినా, వెంటనే స్పందించి వారి సమస్యను పరిష్కరించేవారన్నారు. అందుకే ఆయన నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందారన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చి, నిత్యం ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మేటి అర్జునరావు, కేతరాజుపల్లి సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి పాల్గొన్నారు. గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే సోమసుందరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. సర్పంచ్ సబ్బితి మోహనరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామభద్రారెడ్డి (రాము) తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ప్రతాప్‌కు విశిష్ట సాహిత్య పురస్కారం

సఖినేటిపల్లి: రాజోలు దీవికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు గురువారం ఏలూరులో ప్రభుత్వ సాహిత్య అకాడమీ తరపున జరిగే సాహిత్య సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో విశిష్ట సాహిత్య పురస్కారంతో సత్కరించనున్నారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి నుంచి ఆహ్వానం అందినట్టు బుధవారం ప్రతాప్ తెలిపారు. అనేక రకాలుగా చేసిన సాహిత్య సేవలకు గుర్తింపుగా ఈ విశిష్ట పురస్కారం లభించిందని ప్రతాప్ అన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక

కొత్తపేట: వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1981–84 బ్యాచ్ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో సంక్రాంతి సందర్భంగా అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వీరు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే

అంబాజీపేట: అన్ని గ్రామాల్లో ఈ నెల 19 నుంచి పూర్తి స్థాయిలో కులగణన సర్వే పారదర్శకంగా చేయాలని వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి బుధవారం ఆదేశించారు. గ్రామంలో ఉండే ప్రతి ఇంటిని సందర్శించి, పూర్తి సమాచారం తీసుకోవాలన్నారు. కులగణనకు వచ్చిన సర్వే అధికారులకు ప్రజలు సహకరించి, వివరాలు తెలియజేయాలని కోరారు. సర్వేకు సంబంధించి అధికారులకు, వలంటీర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని ఎంపీడీఓ తెలిపారు.

కిక్ బాక్సింగ్‌లో దినేష్‌కు గోల్డ్ మెడల్

రాజోలు: నిడదవోలులో ఈ నెల 9న జరిగిన అంతర్ కళాశాలల కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజోలుకు చెందిన విద్యార్థి సీహెచ్ దినేష్ గోల్డ్ మెడల్ సాధించాడు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దినేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం సత్కరించి, రూ.రెండు వేల నగదు పారితోషికం అందజేశారు. అలాగే మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ శైలజ రూ.వెయ్యి పారితోషికం ఇచ్చారు. కళాశాల పీడీ బి.మధు కుమార్ సారథ్యంలో నిడదవోలులో ఎస్వీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీల్లో దినేష్ ఈ ప్రతిభ కనబరిచాడు. త్వరలో స్వామి వివేకానంద సుభార్తీ యూనివర్సిటీ(మీరట్)లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటాడు.



దినేష్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో బుధవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని ఎస్సై సురేష్‌బాబు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,120 స్వాధీనం చేసుకున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

అయినవిల్లి: మడుపల్లిలోని మడుపల్లి, వెలవలపల్లి, చింతనలంక గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. సర్పంచ్‌లు నిమ్మకాయల వెంకటలక్ష్మి, బొంతుమణి, చింతలపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, ఎంపీటీసీ చల్లబత్తుల సాయిలక్ష్మి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

మామిడికుదురు: పాశర్లపూడి బాడవ జెడ్పీ హైస్కూల్ ఎదురుగా విద్యుదాఘాతంతో కైకాలపేటకు చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ వేగి వెంకటేశ్వరరావు(48) మరణించాడు. మంగళవారం కరెంటు స్తంభంపై తెగిన విద్యుత్ తీగలను కలుపుతుండగా, షాక్ తగలడంతో కిందపడి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడి ఫిర్యాదుపై నగరం ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేశారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు

మలికిపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంతో గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని మలికిపురం జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి అన్నారు. మండల స్థాయిలో మలికిపురం కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడల ప్రారంభంలో ఆమె పాల్గొని, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా క్రీడలను ప్రోత్సహించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, ఎంఈఓ విజయశ్రీ,, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మంచి ఆరోగ్యం

అంబాజీపేట: మంచి ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని, వీటిపై ప్రతి క్రీడాకారుడు దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ మూర్తి, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కడలి సాయిరామ్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. పుల్లేటికుర్రు ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, పీడీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జీవన శైలి మెరుగుకు..

ఆత్రేయపురం: ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడానికి క్రీడలు ఉపకరిస్తాయని ఎంపీడీఓ నాతిబుజ్జి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ కాలేజీ ఆవరణలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు జరిగాయి. ఎంపీడీఓతో పాటు ఎంఈఓ పీవీ వరప్రసాద్, పీఈటీలు పర్యవేక్షించారు. ముఖ్యఅతిథులు వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు ఈ పోటీలను ప్రారంభించారు. ఎంపీటీసీ పాల వెంకటరమణ, సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



మలికిపురంలో క్రీడాకారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్న కుమారి

హోరాహోరీగా పోటీలు

మామిడికుదురు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడలు హోరాహోరాగా మొదలయ్యాయి. మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో ఈ పోటీలను ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పర్యవేక్షించారు. మామిడికుదురు, లూటుకుర్రు, మొగలికుదురు జెడ్పీ హైస్కూళ్ల ప్రాంగణాల్లో బాలుర, బాలికల మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో పోటీలు ఈ నెల 20 వరకు జరుగుతాయన్నారు.



మామిడికుదురులో వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

1,440 మంది ఎంపిక

కొత్తపేట: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలకు మండలంలో 1,440 మంది ఎంపికయ్యారు. ఎంపీడీఓ ఇ మహేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె పెద్దిరాజు, ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి పర్యవేక్షణలో ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

రాజోలులో క్రికెట్ టోర్నమెంట్

రాజోలు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. డీఎల్పీఓ విజయ్ థామస్, ఎంపీడీఓ ఎస్.బాలాజీ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌కు సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, నాయకుడు బండారు కాశీ జెండా ఊపి ప్రారంభించారు. ప్రముఖులు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, సెక్రటరీ రెహమాన్ పాల్గొన్నారు.

ఉరకలెత్తిన ఉత్సాహం

ఆలమూరు: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ప్రారంభించారు. 24 గ్రామ సచివాలయాల పరిధిలో తొలి రోజు మండల స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. ఫైనల్‌కు చేరిన చెముడులంక, బడుగువానిలంక జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చెముడులంక గ్రామ సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. ఎంఈఓలు ఎస్వీ సుబ్బరాజు, పి.సాలెంరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఆలమూరులో పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సఖినేటిపల్లి: లూథరన్ హైస్కూల్, పల్లిపాలెం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లలో మూడు రోజుల పాటు జరిగే మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఎంపీడీఓ బడుగు మంగాదేవి, సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు పర్యవేక్షించారు.